## పంపిణీకి సిద్ధంగా ఎమ్మెల్సీ ఎన్నికల సామగ్రి

పంపిణీకి సిద్ధం చేస్తున్న సామగ్రి

కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి నియోజకవర్గాల వారీగా పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకనుగుణంగా, బ్యాలెట్ పేపర్‌పై గల అభ్యర్థులను సూచిస్తూ వేసే స్వస్తిక్ గుర్తు గల ముద్రలు, ఓటరు జాబితాలు, ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలు పొందుపరిచేందుకు అవసరమైన కాగిత సామగ్రి, ఎన్వలప్ కవర్లతో పాటు ఇతర సామగ్రిని అవసరమైన మేరకు అందజేసేందుకు వీలుగా సిద్ధం చేసి ఉంచారు. ఎన్నికల సిబ్బందికి మరోదఫా శిక్షణ పూర్తికాగానే ఎన్నికల సామగ్రి అందజేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

## దేవాలయంలో సౌకర్యాల కల్పనకు కృషి: ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం, ఫిబ్రవరి 14: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశలవారీగా ఆలయానికి అన్ని హంగులు సమకూరుస్తూ అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు గట్టు తిరుపతి, బండారి తిరుపతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన 'సాన్వి' వార్షికోత్సవాలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని సాన్వి డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల వార్షికోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాతవాహన యూనివర్సిటీ వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ హరికాంత్, కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్ హాజరై అతిథులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ సేవకు సాన్వి కళాశాల సేవకులను అందిస్తున్నదని కొనియాడారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 14: మండలంలోని అలుగునూర్ గ్రామంలో గల పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీనివాస రామానుజన్ సైన్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపారు. హర్షిణి, శాన్వి రాష్ట్ర స్థాయిలో, అలాగే సత్య త్రివేద్, రాణా యాదవ్, సుదీక్షణ జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీకర్ తెలిపారు విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు

- నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, ఫిబ్రవరి 14: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారులు నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ ఆరోపించారు. శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్క్రూటినిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరు వుట్కూరి నరేందర్‌రెడ్డిగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి, తర్వాత అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిగా మార్చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం ఆయన పేరు సీరియల్ నంబర్‌లో ముందు వరుసలో రావాలని కుట్రలు చేసి, నరేందర్‌రెడ్డి పేరును అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిగా మార్చు చేశారని ఆరోపించారు. అల్ఫోర్స్ అనేది ఒక సైంటిస్ట్‌కి సంబంధించిన పేరు అని, దానిని ఎన్నికల క్రమసంఖ్యలో ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. స్క్రూటిని జరిపిన తర్వాత నరేందర్‌రెడ్డి పేరును కలెక్టర్ ఎలా మార్చారని నిలదీశారు. అన్ని పార్టీలతో కలిపి మొత్తం ఎమ్మెల్సీ ఎన్నికల బీఫాంలు పది మాత్రమే వచ్చాయని, కానీ రాత్రికి రాత్రి 11వ బీ ఫాం శ్రీకాంత్ అనే ఇండిపెండెంట్ అభ్యర్థికి ఇచ్చారన్నారు. ఇండిపెండెంట్‌గా డిక్లేర్ చేసిన అభ్యర్థికి బీ ఫాం ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. నామినేషన్ సమయంలో కూడా తమ వాహనాలను అడ్డగించిన అధికారులు మంత్రుల వాహనాలను మాత్రం లోపలికి అనుమతించి ఎన్నికల నిబంధనలు విస్మరించారని పేర్కొన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. సెక్షన్ 15 ప్రకారం పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు మార్చుకోవాలనుకుంటే ఫారం నంబర్ 4 సమర్పించక ముందే మార్చుకోవాలన్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానాలు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంపై తాను రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో న్యాయవాది తేజ్ దీప్‌రెడ్డి, పెండ్యాల మహేశ్, కెంసారం తిరుపతి, రామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 2023 పోస్టాఫీస్ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

ధర్నాలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 14: 2023 పోస్టాఫీస్ చట్టాన్ని వెనక్కు తీసుకునేంతవరకు నిరంతరం పోరాటాలు కొనసాగుతాయని అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూ మహేందర్ తెలిపారు. పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు 2023 పోస్టాఫీస్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ హుజూరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. తపాలా శాఖలో ప్రవేశపెడుతున్న నూతన సంస్కరణల వల్ల తపాలా వ్యవస్థ నిర్వీర్యం కాబోతున్నదని, ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ నాయకులు రవికుమార్, రజినీకాంత్, తిరుపతి నాయక్, అనిల్ కుమార్, రాజమౌళి, ప్రవీణ్, చంద్రమోహన్, వేణు, సందీప్, శ్రీనివాస్, సమ్మురాజు, మీస తిరుమలేశ్, ఎండీ రఫీ, హరీశ్, అనిల్, గౌరవ్, స్వామి, సతీశ్, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## చల్లూరు ఇసుకయార్డులో ప్రత్యేక బృందం తనిఖీ

వీణవంక, ఫిబ్రవరి 14: మండలంలోని చల్లూరులోని ఇసుక స్టాక్‌యార్డు, రీచ్ పాయింట్ వద్ద ప్రత్యేక బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టింది. రెవెన్యూ, మైన్స్, పోలీస్, రవాణాశాఖ అధికారుల బృందం ఇసుక స్టాక్ యార్డులోని నిల్వలను పరిశీలించింది. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నమోదు చేసిన ఇసుక రవాణా వివరాల రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. చల్లూరు రోడ్డులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ రవాణా ఉద్యోగులతో ఏర్పాటు చేసిన బృందం తనిఖీలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ జియాలజిస్టు వెంకటేశ్వరరావు, వీణవంక ఎస్ఐ తోట తిరుపతి, తహసీల్దార్, శ్రీనివాస్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు

విద్యానగర్, ఫిబ్రవరి 14: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మూల స్తంభాల్లాంటివారని, నేడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ విజయాల బాటలో పయనిస్తున్నారని మహిళా సాధికారత, వ్యాపార వ్యవస్థాపక కమిటీ అధ్యక్షురాలు బెల్లం మాధవి తెలిపారు. స్వదేశీ మేళా ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం 'మహిళా ఆర్థిక స్వాలంబన, అభివృద్ధి' అంశంపై స్వశక్తి మహిళలకు నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా హాజరైన ఆమె మాట్లాడుతూ, మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, జీవనోపాధిని మెరుగుపరచుకోవాలన్నారు. అనంతరం లోకమాత, ధీరవనిత అహల్యాబాయి హోల్కర్ గురించి కేశవ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా ప్రాంత మహిళా ప్రముఖ్, డా. కళ్లెం స్వప్న మాట్లాడారు. భారతదేశ సంస్కృతి పరిరక్షణకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. పాడిపంట, రైతు ఆర్థిక స్వాలంబన సెమినార్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎన్నారై సామ ఎల్లారెడ్డి హాజరై మాట్లాడారు. రైతులు వారి ప్రాంతంలో ఉన్న వనరులను అనుసరించి వ్యవసాయంపై శ్రద్ధ చూపితే కుటుంబానికి అదనపు ఆదాయం, ఉపాధి మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ బల్ల స్వప్న, రాష్ట్ర సేవికాసమితి జిల్లా కార్యవాహిక బూర్ల విజయలక్ష్మి, సహ కార్య వాహిక కామారపు మంజుల, నగర కార్యవాహిక కళ్లెం కవిత, పాక సంధ్య రేఖా, రమ, స్వరూపారాణి, ప్రముఖ న్యూట్రిషనిస్ట్ కావం దీప్తితో పాటు కరీంనగర్ డెయిరీ చైర్మన్, స్వదేశీ మేళా కన్వీనర్ రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు హుజూరాబాద్ వాసులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 14: ఈనెల 15 నుంచి 28 వరకు కాకినాడలో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు హుజూరాబాద్ పట్టణానికి చెందిన మాటూరి రాజేశ్, సాధుల శ్యాంసుందర్‌ను ఎంపిక చేస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మాటూరి రాజేశ్ ములుగు జిల్లా సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా, శ్యాంసుందర్ ముల్కనూరు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి హాకీపై ఉన్న మక్కువనే ఈ టోర్నమెంట్‌కు ఎంపికయ్యేలా దోహదపడిందన్నారు. వీరి ఎంపికపై హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సెక్రటరీ ఉమామహేశ్వర్, హాకీ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## చెత్త రీసైక్లింగ్‌పై దృష్టి పెట్టాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, ఫిబ్రవరి 14 : నగరంలో చెత్త రీసైక్లింగ్, రీయూజ్, రెడ్యూజ్ చేసే విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం రీసోర్స్ పార్కు, నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానాన్ని నగరపాలక సంస్థ పరిధిలో నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్నారు. రీసోర్స్ పార్కులో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిరుపయోగంగా ఉన్న ఆర్ఆర్ఆర్ షెడ్డు, వర్మి కంపోస్టు పిట్స్‌ను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. సాలిడ్, ప్లాస్టిక్ వేస్టు మేనేజ్‌మెంట్ ప్రక్రియను పాటించాలన్నారు. రీసైక్లింగ్ ప్రక్రియ కోసం వాడుకలోకి తేవాలని ఐటీసీ సంస్థ సిబ్బందిని ఆదేశించారు. రీసోర్స్ సెంటర్ మరమ్మతులకు ప్రణాళికలు పూర్తి చేసి చిన్నచిన్న ఆధునీకరణ పనులు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న వర్మి కంపోస్ట్ పిట్స్‌కు అదనంగా మరో 3 కంపోస్ట్ పిట్స్ కట్టించాలన్నారు. ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు ప్రతి రోజు స్వచ్ఛ ఆటోలను తరలించి వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, పర్యావరణ ఇంజినీర్ స్వామి, ఏఈ సతీశ్, ఐటీసీ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

హుజూరాబాద్ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 14: హైదరాబాద్‌లో మహిళా న్యాయమూర్తిపై ఓ ఖైదీ దాడి చేయడాన్ని హుజూరాబాద్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. నిరసనగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. కరడుగట్టిన నేరస్తుల కేసులు విచారించే జ్యుడీషియల్ అధికారుల భద్రత కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, న్యాయవాదులు ముక్కెర రాజు, మంచికట్ల శ్రీనివాస్, భానుకిరణ్, గోపు సమ్మిరెడ్డి, ఆకుల శ్రీనివాస్, కేశబోయిన అశోక్, పిట్టల రాజేశ్, రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## పుల్వామా అమరులకు ఘన నివాళి

గోపాల్‌రావుపేట కూడలిలోని జాతీయ జెండావద్ద పుల్వామా అమరవీరులకు మానవ హారంతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రామడుగు, ఫిబ్రవరి14 : మండలంలోని గోపాల్‌రావుపేట బస్టాండ్ కూడలిలోని భారీ జాతీయ జెండావద్ద శుక్రవారం నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అక్షర హైస్కూల్ విద్యార్థులు మానవహారంగా నిలిచి పుల్వామా అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములుగౌడ్, నిత్య జనగణమన కమిటీ నిర్వాహకుడు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, భారతీయుడిగా ఈ గడ్డమీద జన్మించినందుకు గర్వపడుతూ, మనకోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లకు ఎప్పటికీ రుణపడి ఉండాలన్నారు. ప్రతి పౌరుడూ భరతమాత రక్షణకోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో యూత్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ముర్ర శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గడ్డం రత్నాకర్, సంయుక్త కార్యదర్శి మహేశ్, సభ్యులు అజయ్, రఘువీర్, శ్రీనివాస్, అక్షర విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిటెన్షన్ ఎత్తివేయాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 14: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులకు డిటెన్షన్ విధానం తీసివేసి అడ్వాన్స్ సప్లిమెంట్ పరీక్షలు నిర్వహించాలని వైస్ చాన్స్‌లర్ ఉమేశ్ కుమార్‌కు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం యూఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని రెండు ఫార్మసీ కళాశాలల్లో చదివిన విద్యార్థులు రెగ్యులర్‌గా అధిక మొత్తంలో డిటెన్షన్ అవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలను తక్షణ పరీక్షలకు అనుగుణంగా మార్చాలని, దానికి యూనివర్సిటీ అధికారులు కృషి చేయాలని కోరారు. అలాగే, పరీక్ష తేదీలను 15 రోజులకు పొడిగించాలని కోరగా, దీనికి వీసీ సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చినట్లు చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలుతి రాజేశ్ నాయక్, జిల్లా కార్యదర్శి సంఘ గణేశ్, జిల్లా నాయకులు అభిలాష్, ఉమేశ్, గణేశ్, అశోక్ ఫార్మసీ విద్యార్థులు ఉన్నారు.

## నకిలీ పత్రాలు సృష్టించి.. భూమి విక్రయించి

- కరీంనగర్‌లో నయా భూ కబ్జా పర్వం
- నలుగురి అరెస్ట్ • మరో తొమ్మిది మందిపై కేసు

రాంనగర్ ఫిబ్రవరి 14: నకిలీ పత్రాలు సృష్టించి భూమి కాజేసి విక్రయించిన ఘటనలో నలుగురిని అరెస్ట్ చేయడంతోపాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ తెలిపారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన సర్వేనంబర్ 954లో 11ఎకరాల 23 గుంటల భూమి ఉంది. ఇందులో వావిలాలపల్లికి చెందిన బూరుగుపల్లి వెంకటేశ్వరరావు అతని తల్లి సత్యవతి ఇద్దరికి కలిపి 6.18 ఎకరాలు ఉంది. ఈ భూమిని హద్దుగా అనుకొని రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రామచంద్రరావు(83)కు 2.06 ఎకరాలు ఉంది. ఇదే సర్వే నంబరన్‌లో ఉన్న 2.39 ఎకరాలను ఎస్సారెస్పీ అవసరాల కోసం ప్రభుత్వం సేకరించింది. అయితే బూరుగుపల్లి వెంకటేశ్వరరావు 2002 నుంచి 2022 వరకు తన అవసరాల నిమిత్తం 6.18 ఎకరాల భూమిలో నుంచి నాలుగెకరాలను దాదాపు 34 మందికి విక్రయించాడు. మిగిలిన 2.18 ఎకరాల్లో 1.20 ఎకరాలను కరీంనగర్ టూ సిరిసిల్ల బైపాస్ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం తీసుకోగా, మిగతా 38 గుంటలను తన ఆధీనంలో ఉంచుకొని అమెరికాకు వెళ్లిపోయాడు. అయితే రామచంద్రరావు సైతం 1981 నుంచి 2004వ వరకు ఏడుగురికి పలు దపాలుగా 1.35 ఎకరాలు విక్రయించగా, ఇంకా 11 గుంటలు మిగిలి ఉంది.

### వెంకటేశ్వరరావు భూమిపై కన్ను

వెంకటేశ్వరరావు 38గుంటల భూమిని కాజేయాలని 2014లో కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణ రావు (50), కరీంనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన దాసరి బుచ్చి మల్లా రెడ్డి (67), మహమ్మద్ బషీర్ ముఠాగా ఏర్పడ్డారు. అతని భూమిని హద్దు పట్టాదారుడిగా ఉన్న రామచంద్ర రావుకు అధిక డబ్బు ఆశచూపారు. అతనితో కలిసి విక్రయదారులుగా చేరి, మరో పది మందితో కుమ్మక్కయ్యారు. తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే రోజు 41 గుంటలను పలు భాగాలుగా విభజించుకొని వారందరిపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నకిలీ పత్రాలు సృష్టించేందుకు అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) అందించేందుకు ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులు సహకరించారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. విచారణ చేపట్టిన పోలీసులు, కేసులో ప్రధాన నిందితులైన బల్మూరి రమణారావు (50), గణేశ్‌నగర్‌కు చెందిన దాసరి సంజీవ రెడ్డి (38), దాసరి బుచ్చి మల్లా రెడ్డి (67), క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్ (54)ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన పంతంగి రాంచందర్ రావు, కట్టరాంపూర్‌కు చెందిన బొల్లవేణి శంకర్, జ్యోతినగర్‌కు చెందిన బల్మూరి విజయ్ కుమార్, కరీంనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన దేశవాణి శంకర్, జగిత్యాల జిల్లా ఎండపల్లికి చెందిన మంతెన నర్సయ్య, కరీంనగర్ రాఘవేంద్ర నగర్‌కు చెందిన నందికొండ మురళీధర్ రెడ్డి, కరీంనగర్ తిరుమలనగర్‌కు చెందిన దాసరి శ్రీనివాస రెడ్డి, మరో ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్లకు శిక్షణ

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల ఆర్టీసీ సమావేశ మందిరంలో జైభారత్ మారుతి సంస్థ ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్లకు డిపో-2 మల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎం రాజు మాట్లాడుతూ.. వ్యాన్లు, లారీ డ్రైవర్లుగా పని చేసిన గుర్తింపు కన్నా ఆర్టీసీ సంస్థలో డ్రైవర్లుగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ఏకాగ్రతతో బస్సులు నడిపించాలని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. విధుల్లో చేరే ముందు తగినంత విశ్రాంతి తీసుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ బాలయ్య, డిపో-2 మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పులతడకగా కులగణన సర్వే నివేదిక

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 14: తప్పుల తడకగా కులగణన సర్వే నివేదిక ఉందని, రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు అన్యాయం చేసే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కుట్రలు పన్నుతున్నదని బీసీ నాయకుడు, 30వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసరి మధుకర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2011 గణాంకాల ప్రకారం తెలంగాణ జనాభా 3.50 కోట్లు కాగా, 14 ఏళ్ల తర్వాత రేవంత్ సర్కార్ చేపట్టిన కుల గణన సర్వేలో 3.54 కోట్లుగా చూపారని తెలిపారు. కేవలం నాలుగు లక్షలు మాత్రమే బీసీలు పెరిగినట్లుగా చూపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునే కుట్రలో భాగంగా సర్వే రిపోర్టును బయటపెట్టారని పేర్కొన్నారు.

## కెనాల్ గండి పూడ్చిన రైతులు

గన్నేరువరం, ఫిబ్రవరి 14: మండలంలోని ఖాసీంపేట గ్రామంలోని డీ8కాల్వ కింది సబ్ మైనర్ కాలువకు ఇటీవలే గండి పడింది. దీంతో రైతులు శుక్రవారం కాల్వ నీటి ప్రవాహాన్ని ఆపి ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తరలించి కాల్వ గండిని పూడ్చారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 'విద్యాశాఖ మంత్రిని నియమించాలి'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని, సర్కార్ యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు తప్పవన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేశ్, సునీల్, నవ్య, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎర్త్ లీడర్స్ బ్యాడ్జీల ప్రదానం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని దుర్శేడ్, నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్ బ్యాడ్జీల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను ఎంపిక చేసి యంగ్ ఎర్త్ లీడర్స్ బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ